సాక్షి మహబూబాబాద్

శనివారం । 14 । జూన్ । 2025



ప్రాణం పోస్తున్నారు..
అత్యవసర సమయంలో రక్తదాతల నుంచి సేకరించిన రక్తంతో ఎంతోమంది ప్రాణాలు నిలుస్తున్నాయి. - 8లో▸



కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు
ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి- తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.9⁰ /25.5⁰
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్లు



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం మహబూబాబాద్, కేసముద్రం మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్, నూతనంగా ఏర్పాటైన కేసముద్రం మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారురు వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్యే మురళీనాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. కేసముద్రం మున్సిపాలిటీకి రూ.100 కోట్లు, మహబూబాబాద్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మహబూబాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించి, త్వరలోనే అనుమతులు ఇస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్: ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకోవడంతో పాటు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి చేతుల మీదుగా యోగా పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్‌శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రావణ్ కుమార్, డీవైఎస్‌ఓ జ్యోతి, యోగా ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ హేమ, కమల్, పావని, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన సీఆర్‌పీఎఫ్ ఐజీ



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శుక్రవారం సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్ సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి ఆయన పూజలు నిర్వహించగా పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. టూరిజం గైడ్ వెంకటేష్ ఆలయ విశిష్టతను వివరించగా రామప్ప శిల్పకళాసంపద బాగుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్సై చల్లా రాజు పాల్గొన్నారు.

రేపు చేపూరి శ్రీరాం 29వ అష్టావధానం



చేపూరి శ్రీరాం

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అష్టావధాని చేపూరి శ్రీరాం 29వ అష్టావధానం ఈనెల 15న (ఆదివారం) ఉదయం 10గంటలకు హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నారు. కాకతీయ పద్య కవితావేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ముఖ్య అతిథిగా సహృదయ సాహితీ అధ్యక్షుడు గిరిజామనోహరబాబు, విశిష్ట అతిథిగా దహగాం సాంబమూర్తి, విశ్రాంత విద్యాశాఖ అధికారి రామేశ్వర రాజు పాల్గొంటారని నిర్వాహకులు కొండా యాదగిరి, వెలుగు ప్రభాకర్ తెలిపారు. అనంతరం పద్యకవి సమ్మేళనం నిర్వహిస్తారు.

తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతికి షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.లింగయ్యకు రిజిస్ట్రార్ వి.రామచంద్రం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. లింగయ్య తన పట్ల అమర్యాదకరంగా మాట్లాడి అవమానపర్చారని తెలుగు విభాగం విశ్రాంత ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో రిజిస్ట్రార్ పేర్కొన్నారు. లింగయ్య ఇచ్చే వివరణను బట్టి ఆయనపై చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

చిన్నతనంలోనే పెళ్లి!

జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- అవగాహన లేకపోవడంతో అనర్థాలు
- ప్రేక్షక పాత్రలో అధికారులు
- వివాహం తర్వాత సమాచారంతో ఏమీ చేయలేని పరిస్థితి



నాలుగు సంవత్సరాలుగా జిల్లాలోని అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు..

2021లో	109
2022	68
2023	37
2024	53
2025 (ఇప్పటి వరకు)	24
మొత్తం	291

సాక్షి, మహబూబాబాద్: యుక్తవయస్సు రాకముందు వివాహాలు జరిగితే మగవారికి బాధ్యత తెలియదు.. ఆడవారి ఆరోగ్యం సహకరించదు. చదువుకునే వయస్సులో పెళ్లిళ్లు చేసుకుంటే ఎన్నో బాధలు, మరెన్నో కష్టాలు అనుభవించాల్సి వస్తుంది. కాగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా.. ఎంత మంది ఉద్యోగులతో నిఘా పెట్టిన జిల్లాలో బాల్య వివాహాలు ఆగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి నెట్‌వర్క్ ఉన్నప్పటికీ ఆశించినస్థాయిలో బాల్య వివాహాలను అడ్డుకోలేక పోతున్నారు. వివాహ తంతు ముగిసిన తర్వాత సమాచారం తెలుస్తుండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.

291 వివాహాలు అడ్డుకున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాల్లో 291బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్న జిల్లా కావడంతో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన లేకపోవడం, ఆకర్షణకు లోనై పెద్దలకు చెప్పకుండా పెళ్లి చేసుకుంటున్నారు. ఆడపిల్లలు ఎక్కువగా ఉన్న కుటుంబాల్లో తొందరగా పెళ్లి చేస్తే తమ బాధ్యత తీరుతుందనే ఆలోచనతో తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేస్తున్నారు.

అడ్డుకున్నవి తక్కువే..

ప్రతీ సంవత్సరం వందల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతుంటే.. పదుల సంఖ్యలో మాత్రమే అడ్డుకుంటున్నారనే విమర్శలు వస్తున్నా యి. బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాలను అడ్డుకోవడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, దత్తత, వీధి బాలల సంరక్షణ, అనాథ పిల్లల సంరక్షణ మొదలైన వాటికోసం జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు, చైల్డ్‌లైన్, బాలల పరిరక్షణ, మహిళా సాధికారత వంటి విభాగాలతోపాటు, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. ఇంత నెట్‌వర్క్ ఉన్నప్పటికీ బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోతున్నట్లు విమర్శలు ఉన్నాయి. బాలల సంక్షేమం కోసం ప్రతీ జిల్లాలో ఒక చైర్మన్, నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. కానీ జిల్లాలో చైర్‌పర్సన్, మరో ఇద్దరు కమిటీ సభ్యులు మాత్రమే ఉన్నారు. వీరిలో సమన్వయం లేకపోవడంతో బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్ర స్థాయికి చేరడం లేదని విమర్శలు ఉన్నాయి. అదే విధంగా బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, ప్రమాదాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించకపోవడం, ప్రతీ నెల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహించినా పెద్దగా పట్టించుకోవడంలేదని విమర్శ ఉంది. దీనికి తోడు ఫిర్యాదులకు స్పందించకపోవడం, రాజకీయ ఒత్తిడికి తలొగ్గడం, పలువురు ఉద్యోగులు కాసులకు కక్కుర్తిపడి గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి జరిగేలా ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అదుపు చేయకపోతే అంతే సంగతులు..

జిల్లాలో జరుగుతున్న బాల్య వివాహాలను అదుపు చేయకపోతే భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని డాక్టర్లు, మానసికవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏజెన్సీ గూడేలు, గిరిజన తండాల్లో చిన్నతనంలో పెళ్లిళ్లు చేసుకుని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఎక్కువగా ఉన్నారు. రక్తహీనత, గైనిక్ సమస్యలతో సతమతమవుతున్నవారు అధికంగా ఉన్నారు. చిన్నతనంలో వివాహాలు, కుటుంబ పోషణ భారం, భార్యాభర్తల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా స్త్రీ, పురుషుల నిష్పత్తిలో 1000 మంది పురుషులకు 836 మంది స్త్రీలు ఉన్నట్లు జాతీయ ఆరోగ్య సంస్థ తేల్చి చెప్పింది.

క్షేత్ర స్థాయి నుంచి కట్టడి చేస్తాం



జిల్లాలో బాల్య వివాహాల సంఖ్య ఎక్కువగా ఉండడం బాధాకరం. దీనిని అదుపు చేయడం కోసం జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో క్షేత్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నాం. గిరిజన ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిర్మూలించాలంటే అదరి సహకారం కావాలి.

-రాజ్యలక్ష్మి, బాలరక్షాభవన్ కోఆర్డినేటర్

రాజీమార్గమే మేలు..

- రాజీ కుదుర్చుకోండి.. ప్రశాంతంగా జీవించండి
- నేడు జాతీయ లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్ : ప్రజలు పగలు, ప్రతీకారాలను పక్కనపెట్టి రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుంది. ఈమేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సెక్రటరీ, నర్సంపేట సీనియర్ సివిల్ జడ్జి వరూధిని ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. అదే విధంగా తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్ ఆధ్వర్యంలోనూ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు.

సత్వర న్యాయం, సమస్యల పరిష్కారం..

సత్వర న్యాయం, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న లోక్ అదాలత్ వేదికగా కక్షిదారులు రాజీ కుదుర్చుకుని కేసులను పరిష్కరించుకొని ప్రశాంతంగా జీవించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కోరుతుంది. సుప్రీంకోర్టు 1987 సంవత్సరంలో లీగల్ సర్వీసెస్ అథారిటీకి చట్టబద్ధమైన హోదాను కల్పించింది. అప్పటినుంచి ప్రతీ మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయమూర్తులు చర్యలు తీసుకుంటున్నారు. జడ్జిలు, న్యాయవాదులు, న్యాయ సంస్థలు, ఎక్సైజ్, సివిల్ పోలీసులు సమన్వయంతో వ్యవహరిస్తూ వివిధ కేసుల్లోని కక్షిదారులను సమన్వయం చేస్తూ కేసులను పరిష్కరిస్తున్నారు.

పరిష్కరించేందుకు సిద్ధం..

రాజీ పడదగిన సివిల్, మోటార్ వాహన ప్రమాదాలు, క్రిమినల్, వివాహ కుటుంబ కేసులు, బ్యాంకు చెక్కు బౌన్స్ కేసులు, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ (దొంగతనాలు), ట్రాఫిక్, ఈ చలాన్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారు. కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియజేసి రాజీ కుదుర్చుకుని కుటుంబసభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలంటున్నారు.

కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలి..



లోక్ అదాలత్‌ను వేదికగా చేసుకుని రాజీ కుదుర్చుకుని శాంతియుత వాతావరణంలో జీవించాలి. క్షణికావేశంలో జరిగిన ఘర్షణలు, కేసుల నమోదుల కారణంగా కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. అందుకనే లోక్ అదాలత్‌లో కేసులను రాజీచేసుకుని ప్రశాంతమైన జీవితం గడపాలి.

మహమ్మద్ అబ్దుల్ రఫీ,
జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి.

నిబంధనలు పాటించాలి

- డీఏఓ విజయనిర్మల

దోర్నకల్: విత్తన విక్రయ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీఏఓ విజయనిర్మల సూచించారు. డోర్నకల్, గొల్లచర్ల, చిలుకోడు గ్రామాల్లోని ఫెస్టిసైడ్స్ దుకాణాలతో పాటు సొసైటీ కార్యాలయాల్లో శుక్రవారం డీఏఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులతో పాటు విత్తనాల నిల్వలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. దుకాణదారుల పీఓఎస్ మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. దుకాణదారులు స్టాక్ వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



గొల్లచర్ల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏఓ

శిథిలావస్థలో 'డబుల్ ఇళ్లు'



వెన్నారం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి కోసం ముగ్గు పోసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

- వెన్నారంలో 72ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- 44ఇళ్లు పూర్తి.. పంపిణీపై దృష్టి సారించని అధికారులు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం 440 దరఖాస్తులు.. 28మందికి మంజూరు

దోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీకి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఇళ్ల పంపిణీ అటకెక్కింది. 2017లో 72 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా 2019లో 18ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి విద్యుత్, సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. అయితే లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. విద్యుత్ మీటర్లు ఊడి, కిటికీల అద్దాలు పగిలి ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. అలాగే కొద్ది రోజుల క్రితం మధ్యలో నిచిలిపోయిన మరో 26ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి నోచుకోవడం లేదు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 440 దరఖాస్తులు..

వెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 440 మంది దఖాస్తు చేసుకున్నారు. ఇటీవల మొదటి విడతలో 28మందికి ఇళ్లు మంజూరయ్యాయి. కాగా 23 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. వీరిలో చాలామంది ముగ్గులు పోసుకుని ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం!

- జిల్లాలో కానరాని పశు వధశాలలు
- విచ్చలవిడిగా మాంసం విక్రయాలు
- చనిపోయిన, అనారోగ్యంతో ఉన్న జీవాలను వధిస్తున్నట్లు ఆరోపణలు



మోడల్ మార్కెట్ ఎదుట మాంసం విక్రయాలు

మహబూబాబాద్: పశు వధశాలలు లేకపోవడంతో మాంసం విక్రయాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా పశు వధశాలల్లో గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటేనే వధించేందుకు పశువైద్యాధికారి అనుమతి ఇస్తారు. కాగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో పశు వధశాలలు లేకపోవడంతో పలువురు వ్యాపారులు చనిపోయినవి, అనారోగ్యంతో ఉన్న వాటిని వధించి విక్రయిస్తున్నారనే ఆరోపణ లు వస్తున్నారు. కాగా పన్ను వసూలు చేసేందు కు మాత్రం కమేళా వేలం నిర్వహిస్తున్న మున్సిపాలిటీలు.. ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు మున్సిపాలిటీల్లో కానరాని పశు వధశాలలు..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు మానుకోట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, కేసముద్రంలో పశు వధశాలలు లేవు. కాగా మానుకోట మున్సిపాలిటీగా ఏర్పడకముందే.. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో సుమారు 40ఏళ్ల క్రితం పశువధశాల నిర్మించి వ్యాపారాలు నిర్వహించారు. అయితే ఆ తర్వాత కొన్నాళ్లకు మూత పడింది. మరిపెడ మున్సిపాలిటీ పరిధి పశు సంత సమీపంలో పశువధశాల ఉన్నప్పటికీ అది మూతపడింది. ఇలా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ప్రస్తుతం పశువధశాలలు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా, అధిక ధరలకు మాంసం విక్రయాలు జరుపుతున్నారు. కిలో మాంసం ధర రూ.1000 కాగా, బోన్‌లెస్ మటన్ ధర రూ.1200 వరకు విక్రయిస్తున్నారు.

వధశాల ఉంటే..

పశువధశాల ఉంటే.. అందులో పశువైద్యాధికారి పరీక్షలు నిర్వహించి జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే కోసేందుకు అనుమతి ఇస్తారు. స్లాటరీ, సర్టిఫై చేసి, స్టాంప్ వేసిన తర్వాత మాంసం విక్రయించే అవకాశం ఉంటుంది. ఇలా ఆరోగ్యవంతమైన జీవాల మాంసం కొనుగోలు చేసిన ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు.

ఎలాంటి నిబంధనలు లేకుండానే..

వ్యాపారులు తక్కువ ధరలకు వయస్సు మీదపడిన, అనారోగ్యంతో ఉన్న మేకలు, గొర్రెలు కొనుగోలు చేసి వాటిని వధించి విక్రయాలు చేస్తున్నారు. షాపుల వద్ద కనీస పరిశుభ్రత పాటించడం లేదు. అక్కడ సరైన నీటి వసతి కూడా ఉండడం లేదు. బకెట్‌లో నీళ్లు తెచ్చుకుని దానిలో కడిగి వ్యర్థాలు కూడా అక్కడే వేస్తున్నారు. దుర్గంధం వెదజల్లడంతో పాటు ఈగలు వాలుతున్న మాంసం విక్రయిస్తున్నారు. కొంత మంది ఎక్కడో కోసుకుని వచ్చి మాంసం మాత్రం రోడ్లపై పెట్టి విక్రయిస్తున్నారు. అది ఏ జంతువు మాంసం అనేది తెలియకుండానే ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారంగా భావిస్తున్నారే తప్ప ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు.

స్థలాల కేటాయింపు పరిశీలనకే పరిమితం..

మానుకోట మున్సిపాలిటీలతో పాటు మిగిలిన మున్సిపాలిటీల్లో పశువధశాలల ఏర్పాటుకు స్థలాల పరిశీలన చేశారు. కానీ నేటి వరకు స్థలాల కేటాయింపు జరగలేదని అధికారులు తెలిపారు. వధశాలల ఏర్పాటుపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రవి రాథోడ్

నెహ్రూసెంటర్: అసంక్రమిత వ్యాధుల ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నర్సింగ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు స్పెషలిస్టు డాక్టర్లతో కౌన్సెలింగ్, చికిత్స అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా అబా కార్డులను జనరేట్ చేయాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు నాగేశ్వర్‌రావు, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, డీడీఎం సౌమిత్, సూపర్‌వైజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు

డోర్నకల్: ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ హెచ్చరించారు. డోర్నకల్ పట్టణం ఇందిరానగర్‌లోని ప్రైవేట్ క్లీనిక్‌లో నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నారని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం క్లీనిక్‌ను సీజ్ చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లోని మరో క్లీనిక్‌లో ఆర్ఎంపీ స్థాయికి మించి వైద్యం చేస్తున్నాడని హ్యూమన్ రైట్స్‌కు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు దానిని కూడా సీజ్ చేశారు. కార్యక్రమంలో అధికారి కొప్పు ప్రసాద్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం.శివప్రసాద్

నెహ్రూసెంటర్: ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, అదనపు సర్వీసులను పెంచాలని ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి ప్రజలు, ప్రయాణికులు ఫోన్ ద్వారా వినతులను సమర్పించారు. మానుకోట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి 14 వినతులు వచ్చినట్లు డీఎం ఎం.శివప్రసాద్ తెలిపారు. మహబూబాబాద్-సింగారం-మునిగలవీడు, మహబూబాబాద్-మట్టెవాడ-గూడూరు, మహబూబాబాద్-మరిపెడ-రాంపూర్-హైదరాబాద్, మరిపెడ-చిన్నగూడూరు సర్వీసులను నడిపించాలని ప్రయాణికులు కోరినట్లు తెలిపారు. మరిపెడ బస్టాండ్ ప్రాంగణంలో సమయపాలన సూచిక ఏర్పాటు చేయాలని పలువురు కోరినట్లు డీఎం తెలిపారు. సదరు రూట్లను పరిశీలించి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడిపిస్తామని డీఎం వెల్లడించారు.

ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ విజేత నల్లగొండ

- ద్వితీయ స్థానంలో వరంగల్
- బాల్ బ్యాడ్మింటన్‌లో వరంగల్ జట్టు విజేత

హన్మకొండ: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ 2025–2026 శుక్రవారం ముగిసింది. బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు పోటీ పడగా, వరంగల్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల జట్టు విజేతగా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానంలో, నల్లగొండ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ ఫైనల్‌లో నల్లగొండ, వరంగల్ జట్లు పోటీపడగా నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. వరంగల్ జట్టు ద్వితీయ స్థానం, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో కబడ్డీలో 12 జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో 9 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.మధుసూదన్, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, కన్వీనర్ ఎ.విజేందర్ రెడ్డి, సభ్యులు ఎండీ యాకూబ్ పాషా, సునీల్ కుమార్, ఇ.ప్రేమ్ కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



గోవిందాపురంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందాపురంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా మరిన్ని ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే జీర్ణించుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గోవిందాపురం జీపీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు.

విద్యకు పెద్దపీట..

నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలకుసామూహిక అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతుల మానిటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కొత్తగూడ, గంగారం మండలాల ప్రజలకు తాగు, సాగు నీరు అందించేందుకు పాకాల చెరువుపై లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీడబ్ల్యూఓ ధనమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్, కొత్తగూడ, గంగారం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని స్పోర్ట్స్ స్కూళ్లలో 2025–2026 విద్యాసంవత్సరానికి గానూ 4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి జ్యోతి తెలిపారు. ఈ నెల 16నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయిలో, 26న జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి

- కార్యకర్తలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపు


అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన కొత్తగూడ, గంగారం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐఏఎస్ అధికారుల బదిలీల వల్ల కొంత జాప్యం జరుగుతుందని, వారం పది రోజుల్లో ఎన్నికలపై స్పష్టత వస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సూచించారు. రైతు భరోసా కొంత ఆలస్యమవుతున్న విషయం నిజమేనని, అది కూడా త్వరలో ప్రభుత్వం వేస్తుందన్నారు. ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలతో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా మండలకేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలకు మంత్రి సీతక్క.. సామూహిక విద్యాభ్యాసం చేయించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

ప్రైవేట్‌లో అధిక ఫీజులను నియంత్రించాలి


వినతిపత్రం అందజేస్తున్న సురేష్, తదితరులు

విద్యారణ్యపురి: ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల భారాన్ని నియంత్రించాలని విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం పేదవర్గాల పిల్లలకు అడ్మిషన్లు కల్పించేలా చర్యలు చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ డీఈఓ వాసంతి, వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌కు శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దాసు సురేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్డూ.. అదుపు లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. పేదపిల్లలకు ప్రైవేట్‌లో ఉచితంగా విద్యను అందించాలని రాజ్యాంగంలోనే ఉందన్నారు. ప్రతి తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ వంగ రవియాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుగొండ హైమవతి, సిలువేరు రవీందర్, అశోక్, కొడపాక దేవి, శ్రీరామోజు అంజలి, యోగేశ్వర్ పాల్గొన్నారు.



ప్రాణం పోస్తున్నారు..

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

- రక్తదానంలో యువత ముందంజ
- అవగాహన కల్పించడంలో ఎన్జీఓల కృషి
- అత్యవసర సమయంలో కాపాడుతున్న రక్తదాతలు



ప్రమాదం జరిగినప్పుడు.. అనారోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు రక్తం అందక అనేకమంది మృత్యుఒడికి చేరిన ఘటనలున్నాయి. కానీ ప్రస్తుతం ఎన్జీఓలు, యువజన సంఘాలు రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడం ద్వారా రక్తదానంపై వారిలోని అపోహలను దూరం చేస్తున్నారు. తద్వారా అనేకమంది యువత రక్తదానం చేసి చావుబతుకుల్లో ఉన్నవారికి ప్రాణం పోస్తున్నారు. ఈనేపథ్యంలో నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భం ప్రత్యేక కథనం.


భూపాలపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

టేకుమట్ల: రక్తదానం చేయడం వల్ల నీరసించి ఆరోగ్య ఇబ్బందులు ఏర్పడతాయనే అపోహ ప్రజల్లో ఉంటుంది. కానీ, అలాంటిది జరగదు. కేవలం 21 రోజుల్లోనే పూర్తి స్థాయిలో రక్తం శరీరంలో సమకూరుతుంది. అలాగే 6 నుంచి 12 వారాల్లో పురుషులకు, 6 నుంచి 16 వారాల్లో మహిళలకు హిమోగ్లోబిన్ స్థాయిలు సమంగా చేరుకుంటాయి. ఈవిషయంపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, రెడ్‌క్రాస్ వంటి సంస్థలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ రక్తదానం చేసేలా చొరవ చూపుతున్నాయి. దీంతో యువత రక్తదానం వైపు అడుగు వేస్తూ ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతున్నారు.

ఎవరు రక్తదానం చేయాలి..

ఎవరు రక్తదానం చేయాలనే విషయంపై ఎంతో మంది ఆలోచనలో పడి రక్తదానం చేయడంలో కాస్త వెనుకడుగేస్తున్నారు. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలలోపు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కానీ, హెపటైటిస్ బీ, హెచ్‌ఐవీ, రక్తహీనత, బలహీనత, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు.. రక్తదానం చేసేందుకు అనర్హులుగా వైద్యులు చెబుతారు.

ఎంతో మందికి పునర్జన్మ

అత్యవసర సమయంలో రక్తదాతల నుంచి సేకరించిన రక్తంతో ఎంతో మంది పునర్జన్మ పొందారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో రక్త నిల్వలు లేక ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. అలాంటి పరిస్థితి రాకుండా రక్తదానం చేస్తూ ప్రాణాలను కాపాడాలని పలువురు మానవతావాదులు కోరుతున్నారు.

విలువైన ప్రాణాలను కాపాడొచ్చు..



ప్రతీ సంవత్సరం అక్టోబర్‌లో నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొంటాను. గ్రామాల్లోని యువతకు రక్తదానంపై అవగాహన కల్పించి ఎంతో మందిచే రక్తదానాన్ని చేయించాను. రక్తదానంపై అపోహలను నివృత్తి చేస్తూ ముందుకు సాగేలా కృషి చేశాను. భవిష్యత్‌లో కూడా యువతను రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తూ నేను చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడొచ్చు.

- దాసరి సుధాకర్, ఎస్సై, టేకుమట్ల

12 సార్లు రక్తదానం చేశాను..



విద్యార్థి దశ నుంచే రక్తదానం చేస్తున్నాను. నాతోపాటు నా మిత్రులచే రక్తదానం చేయిస్తున్నాను. ఇప్పటి వరకు 12 సార్లు రక్తదానం చేశాను. ఆపద సమయంలో రక్తదానం చేయడంద్వారా ప్రాణం పోసినట్టే అనే తృప్తి ఉంటుంది. భవిష్యత్‌లో కూడా రక్తదానం చేస్తాను.

- సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి, రామకిష్టాపూర్(వి)

అపోహలు వీడాలి..



రక్తదానం చేయడం వల్ల నీరసించి అనారోగ్యబారిన పడతామనేది అపోహ మాత్రమే. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. మానవుని దేహంలోని ఎర్ర రక్త కణాలు ప్రతీ మూడు నెలలకొకసారి చనిపోతూ మళ్లీ కొత్తగా ఉత్పత్తి అవుతాయి. కావున రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకునే గొప్ప అవకాశం కలుగుతుంది.

- డాక్టర్ ఆశాజ్యోతి, పీహెచ్‌సీ, వెలిశాల

మేనత్తను హతమార్చిన మేనల్లుడి అరెస్టు

- 170 గ్రాముల బంగారం, 34 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ అంకిత్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

వరంగల్ క్రైం: మద్యానికి అలవాటు పడి, జల్సాలకు అవసరమైన డబ్బు కోసం మేనత్తను హత్య చేసి ఒంటి మీద ఉన్న నగలను చోరీ చేసిన వరంగల్‌లోని మట్టెవాడ రాజీవ్‌కాలనీకి చెందిన రేకులపెల్లి ప్రణయ్‌ని గీసుగొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి పోలీసులు రూ.18 లక్షల విలువగల సుమారు 170 గ్రాముల బంగారు, 34 గ్రాముల వెండి అభరణాలతోపాటు రూ.10 వేలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన కొచన స్వరూప (70)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈస్ట్‌జోన్ డీసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన గీసుగొండ పోలీసులు టెక్నాలజీని వినియోగించి ప్రణయ్‌ని శుక్రవారం అరెస్టు చేసి గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో విచారించినట్లు తెలిపారు. ఈక్రమంలో ప్రణయ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జల్సాలు, బైక్ కొనుగోలుకు పెద్ద మొత్తంలో అప్పు చేసినట్లు తెలిపారు. ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ క్రమంలో స్తంభంపల్లిలో ఒంటరిగా ఉంటున్న తన మేనత్త స్వరూప వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని, ఆమెను చంపి డబ్బు, బంగారం దోచుకోవచ్చని ప్లాన్‌వేసినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన తన మేనత్త స్వరూప వద్దకు వెళ్లిన ప్రణయ్ ఆమెతో కలిసి మద్యం సేవించిన అనంతరం మృతురాలి ఇంటిలోనే నిద్రించాడు. స్వరూప గాఢ నిద్రలో ఉన్న సమయంలో డంబెల్‌తో మేనత్త తలపై కొట్టినట్లు తెలిపారు. స్వరూప మరణించినట్లుగా నిర్ధారించుకుని ఒంటిపై ఉన్న బంగారు అభరణాలతోపాటు ఇంట్లోని వెండి ఆభరణాలు, డబ్బును దోచుకొని వెళ్లినట్లు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్లపల్లి–తిరుపతి మధ్య 10 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా..

జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చర్లపల్లి–తిరుపతి (07251) ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుపతి–చర్లపల్లి (07252) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుటుంది. 1 ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రైళ్ల సర్వీస్‌లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో జనగామ, కాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీ కాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సంజీవ రెడ్డి, చిత్రంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరినట్లు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–327 అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బట్టి విక్రమార్కను వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యలు చెప్పిన వెంటనే ట్రాన్స్ కో సీఎండీకి ఫోన్ చేసి త్వరలో విద్యుత్ ఉద్యోగ సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ మార్పు చేయడంతోపాటు ఏపీ ఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయాలని, 01.02.1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సంస్థలో మిగిలివున్న 6,500 అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లు, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. ఖాళీలను భర్తీ చేయాలని, ట్రాన్స్‌కో సీబీడీ గ్యాంగ్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు విద్యార్హతతో పనిలేకుండా గ్రేడ్–1 జీతం ఇవ్వాలని కోరామన్నారు. కారుణ్య నియామకాల వయస్సును 25 నుంచి 46 సంవత్సరాలకు పెంచాలని కోరినట్లు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, టీఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేఎంటీపీ టౌన్‌షిప్ పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్
- టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ఉత్పత్తుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

గీసుకొండ: వరంగల్ గీసుకొండ– సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో భూములు కోల్పోయిన 863 మంది రైతులకు ప్లాట్ల కోసం అభివృద్ధి చేసిన 'రాజీవ్ మెగా లేఅవుట్ టౌన్‌షిప్' పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన టీజీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి కేఎంటీపీని సందర్శించారు. టౌన్‌షిప్‌లో పురోగతిలో ఉన్న ప్రాథమిక మౌలిక సదుపాయాల పనులు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వ, మంచినీరు, విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వెంటనే లేఅవుట్ మంజూరు చేసి ప్లాట్లు కేటాయించిన వారికి రిజిస్ట్రేషన్ చేయించాలని 'కుడా' అధికారులను ఆదేశించారు. గణేశా ఎకోపెట్, యంగ్‌వన్ కంపెనీల్లో తయారవుతున్న ఉత్పత్తులు, కై టెక్స్ కంపెనీలో జరుగుతున్న ట్రయల్‌రన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ మూడు కంపెనీల ప్రతినిధులు, టీజీఐఐసీ అధికారులతో ఆయన పనుల పురోగతిపై సమీక్షించారు. కేఎంటీపీలో వరద ముంపును నివారించడానికి వంద మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న కాల్వ పనులను పరిశీలించి సాంకేతికంగా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ఎంత వరకు తగ్గించవచ్చో ప్రతిపాదనలు పంపాలన్నారు. టీజీఐఐసీ చీఫ్ ఇంజనీర్ రవి, జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, గీసుకొండ, సంగెం తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, గణేశ కంపెనీ వైస్ చైర్మన్ కేఎస్ రెడ్డి, హెచ్‌ఆర్ శంకర్, టీజీఐఐసీ, 'కుడా' అధికారులు పాల్గొన్నారు.

భూమికి పరిహారం చెల్లించాలని..

- పురుగుల మందు డబ్బాతో విద్యుత్‌స్తంభం ఎక్కి రైతు హల్‌చల్


టవర్ ఎక్కి చస్తానని బెదిరిస్తున్న రైతు నూకల రవి

కురవి: తన భూమికి పూర్తి పరిహారం చెల్లించకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చేస్తున్నారని మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లిలో రైతు నూకల రవి పురుగుల మందు డబ్బా పట్టుకుని హైవే రోడ్డు కోసం పక్కన నిర్మించిన విద్యుత్ స్తంభం(టవర్) ఎక్కాడు. పూర్తి పరిహారం చెల్లించే వరకు దిగేది లేదని, పురుగుల మందు తాగి టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. తన 1.34 ఎకరాల భూమి గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూసేకరణ చేశారని, 1.12 ఎకరాలకు నష్టపరిహారం కింద రూ.14లక్షలు చెల్లించారని, ఇంకా 22 గుంటల భూమికి పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపాడు. విషయం తెలుసుకున్న ఏఎస్సై వెంకన్న, ఆర్ఐ రవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్తంభం ఎక్కిన రైతుతో మాట్లాడారు. ఎంత చెప్పినా వినకుండా కిందికి దూకుతానని అనడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అదే సమయంలో టవర్ కింద రైతు తల్లి ఉప్పలమ్మ, భార్య రజిత, కొడుకు వంశీకృష్ణలు ఆందోళనకు దిగారు. చివరికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కురవి సబ్ డివిజన్ నాయకుడు సామ పాపయ్య సంఘటన స్థలానికి వచ్చి పరిహారం అందే వరకు నీ తరపున పోరాటం చేస్తామని చెప్పడంతో టవర్ దిగాడు. మళ్లీ లారీల్లో మట్టి తీసుకొచ్చి పనులు చేస్తుండడంతో రవి ఆ వాహనం ఎదుట బైఠాయించాడు. భూమిలో పనులు చేయొద్దని కాంట్రాక్టర్‌కు చెప్పడంతోపాటు పూర్తిస్థాయి అందేలా సాయం చేస్తానని రవికి ఆర్ఐ రవికుమార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా, ఈ విషయమై ఆర్ఐ రవికుమార్ వివరణ కోరగా నూకల రవికి సంబంధించిన బంధువు (పెద్దభార్య కొడుకు) తన కు వాటా కావాలని, పరిహారం చెల్లించాలని మహబూబాబాద్ కోర్టును ఆశ్రయించాడని, అందుకే పరిహారం అందడంలో ఆలస్యం అవుతుందని వివరించాడు.

ఏటీఎం అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్


మాట్లాడుతున్న ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్

జనగామ: ఏటీఎం కేంద్రాల వద్ద ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని, డబ్బులు డ్రా చేసుకుంటున్న ఓ దొంగను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన జనగామ పట్టణంలో శుక్రవారం జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా ఈపూర్ మండలం ఇనుమెల్ల గ్రామానికి చెందిన ముల్లముడి వెంకటకోటేశ్వరావు ఓ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతూ నష్టపోయి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి పారిపోయి.. దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఏటీఎంల నుంచి సులువుగా డబ్బులు ఎలా డ్రా చేయొచ్చని యూట్యూబ్ ద్వారా నేర్చుకున్న వెంకటకోటేశ్వరావు ప్రజలు ఏటీఎం వద్దకు వచ్చి డబ్బులు డ్రా చేసుకునే క్రమంలో వారిని మాటల్లో పెట్టి కార్డు మార్చి డబ్బులు డ్రా చేసుకునేవాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు డ్రా చేసుకుని నల్లగొండ, సంగారెడ్డి, పరకాల జైలులో కొంతకాలం శిక్ష అనుభవించాడు. ఈక్రమంలో జనగామ జిల్లా నర్మెట మండలం మచ్చుపహాడ్ శివారు సూర్యబండ తండాకు చెందిన భూక్యా భాస్కర్ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఏమార్చి డబ్బులు కాజేసినట్లు ఫిర్యాదు చేయడంతో.. డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఏఎస్పీ, సీఐ దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై భరత్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏటీఎంల వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో బస్టాండ్ రోడ్డు వైన్స్ సమీపంలోని ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వెంకట కోటేశ్వరరావును ఎస్సై భరత్ అదుపులోకి తీసుకుని విచారించగా, ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితున్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్సై భరత్, కానిస్టేబుళ్లు కర్ణాకర్, సాగర్, మహేందర్, సల్మాన్‌లను సీపీ అభినందించినట్లు ఏఎస్పీ తెలిపారు.

నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందు స్వాధీనం

- కాటారం, మహాముత్తారం మండలాల్లో అధికారుల తనిఖీలు
- ఆరుగురిపై కేసు నమోదు


నకిలీ పత్తివిత్తనాలు, నిషేధిత గడ్డిమందు నిల్వలను చూపుతున్న సీఐ, ఎస్సై

కాటారం(మహాముత్తారం): కాటారం, మహాముత్తారం మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్న నకిలీ పత్తివిత్తనాలు, నిషేధిత గడ్డి మందు దందాను పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు ఛేదించారు. కాటారం, మహాముత్తారం మండలాల్లో ఎస్సై మహేందర్‌కుమార్, ఏఓ అనూష సంయుక్తంగా దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డి మందు నిల్వలను పట్టుకున్నారు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై మహేందర్‌కుమార్ శుక్రవారం మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం ఘనికపూడికి చెందిన అచ్చ హన్మంతరావు, కాటారం మండల కేంద్రానికి చెందిన బొమ్మ సమ్మిరెడ్డి, మల్హర్ మండలం పాత రుద్రారానికి చెందిన జాడి సమ్మయ్య, మహాముత్తారం మండలం నల్లగొండ మీనాజీపేటకు చెందిన చీర్ల సతీశ్, కాటారానికి చెందిన బొమ్మన వెంకటస్వామి, కొత్తపల్లికి చెందిన కందుల కోటేశ్వరరావు.. నకిలీ పత్తివిత్తనాలు, నిషేధిత గడ్డిమందు విక్రయాలు చేపడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అనుమానితుల ఇళ్లలో శుక్రవారం దాడులు నిర్వహించగా.. భారీ మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డిమందు గుర్తించినట్లు తెలిపారు. సుమారు రూ.5,06,250 విలువ చేసే 202.5కేజీల నకిలీ పత్తి విత్తనాలు, సుమారు రూ.1,20,000 విలువ చేసే 300లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనపర్చుకున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. ఏఓ అనూష ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆయుర్వేదంలో నూతనవిధానాలను అన్వేషించాలి

- స్టేట్ లెవల్ కౌశలం–2025 సదస్సులో ప్రముఖ వైద్యులు


సదస్సులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జనగామ: ఆయుర్వేద వైద్య రంగంలోకి రాబోతున్న నూతన వైద్యులు నూతన విధానాలను అన్వేషించాలని ప్రముఖ వైద్యులు పేర్కొన్నారు. జనగామలోని వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్, విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ కౌశలం–2025 సదస్సును నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాలల్గో రోజు సదస్సులో డాక్టర్ కల్నల్ భిక్షపతి మాట్లాడుతూ హృదయం, మెదడు, శ్వాస సంబంధిత అత్యవసర పరిస్థితులపై వైద్యవృత్తిని చేపట్టబోతున్న విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ శివ మాట్లాడుతూ.. శాలాక్య తంత్రంలో స్వస్థ వృత్తం(తెల్లవారు లేచింది మొదలు పడుకునే వరకు యాక్టివిటీస్) ప్రాముఖ్యతను వివరించారు. రుతు, దినచర్యలు మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఎలా ఉపయోగపడతాయనే పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వందనాసింగ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ లక్ష్మణ్ యాదవ్, డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడారు.

బాత్‌రూంలో జారిపడి ఉపాధ్యాయుడి మృతి

- మృతుడిది ఖమ్మం జిల్లా మద్దులపల్లి


తండ్రి మృతదేహంపై పడి రోదిస్తున్న కుమారుడు రామ్‌కుమార్


రాజేంద్ర ప్రసాద్ (ఫైల్)

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాల బాత్‌రూంలో జారిపడి ఉపాధ్యాయుడు మృతిచెందాడు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ రాజేంద్ర ప్రసాద్ (55) పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో మూడేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం బడిబాట కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా రాజేంద్ర ప్రసాద్‌కు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో (కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు) పాఠశాలలోనే ఉండాలని తోటి సిబ్బంది చెప్పి వెళ్లారు. ఈనేపథ్యంలో హాస్టల్ సిబ్బంది రాజేంద్రప్రసాద్ కోసం భోజనం తీసుకుని క్వార్టర్స్‌కు రాగా.. బాత్‌రూంకు వెళ్లి వచ్చాక భోజనం చేస్తానని చెప్పాడు. ఎంతకూ బాత్‌రూంనుంచి బయటకు రాకపోవడంతో సిబ్బంది.. తలుపు తెరిచి చూడగా కింద పడిపోయి ఉన్నారు. దీంతో పేరూరు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజేంద్ర ప్రసాద్‌కు భార్య ప్రమీలరాణి, కుమారుడు రామ్‌కుమార్, కుమార్తె స్రవంతి ఉన్నారు. ఏటీడబ్ల్యూఓ క్షేత్రయ్య ఏటూరునాగారం వైద్యశాలకు వచ్చి వివరాలు సేకరించారు.